క్లుప్తంగా

నేడు బోనాల పండుగ



ముస్తాబైన పోచమ్మ తల్లి దేవాలయం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో ఆదివారం ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. కాలనీలోని పోచమ్మ, దుర్గామాత, ముత్యాలమ్మ తల్లుల ఆలయాలకు భక్తులు బోనాలు తీసుకురానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చెత్త తొలగించారు. ఆదివారం బోనాల సమర్పణ, సోమవారం తొట్టెల ఊరేగింపులు కొనసాగనున్నాయి.

గోరింటాకు ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలో ఉన్న లార్డ్స్ స్కూల్‌లో శనివారం ఆషాఢమాసం గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ఈ వేడుకలు నిర్వహించారు. ఆషాఢమాసం ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి జ్యోతిర్మయి, డీన్ బీ.సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ అనిల్‌యాదవ్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 16వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రూప, కాలనీవాసులు పార్వతి, బషీరాబి, మహ్మద్‌అలీ, బాలమణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పులిమామిడి గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం కాంగ్రెస్ నాయకుడు బుక్క పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, స్కూల్ చైర్మన్ సయ్యద్ ఇలాసత్, నాయకులు రేవెళ్ల శేఖర్, బానూరి గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీపీ నిర్ధారణ పరీక్షలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మీర్‌పేట: మీర్‌పేట నందిహిల్స్‌లోని శ్రీవిద్య పాఠశాలలో శనివారం 9, 10వ తరగతి విద్యార్థులతో రక్తపరీక్షలు, బీపీ నిర్ధారణ పరీక్షలను చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు సీహెచ్.వెంకటేశ్వర్లు, మహేశ్‌లు మాట్లాడుతూ.. బయోలజీ సబ్జెక్టులోని ఓ పాఠ్యాంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో భాగంగా ల్యాబ్‌లో జరిగే కార్యకలాపాలపై స్వయంగా తెలియజేసేలా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఇతర తరగతుల విద్యార్థులకు పరీక్షలు చేసి బ్లడ్ గ్రూప్‌లను ఎలా కనుక్కోవాలో వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో విద్య అదుర్స్

- మహేశ్వరం స్కూల్లో అడ్మిషన్లు ఫుల్
- ఆసక్తి చూపిస్తున్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు
- ప్రవేశాలకు తీవ్ర పోటీ
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



డిజిటల్ తరగతుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్లో ఉత్తమ ఫలితాలు వస్తుండడంతో పాటు విశాలమైన తరగతి గదులు, మైదానం, చుట్టూ పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదమైన వాతావారణంతో పాటు అనుభవంతో కూడిన అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు. నాణ్యతతో కూడిన విద్య, ప్రొజెక్టర్ సహాయంతో డిజిటల్ తరగతులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ సౌకర్యాలతో మంచి విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది. ప్రైవేట్ పాఠశాలల నుంచి మోడల్ స్కూల్లో ప్రవేశానికి ఆసక్తి కనబరుస్తున్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో ఉంటుంది. 100 మంది బాలికలకు హాస్టల్ వసతి కలదు. ఇటీవల ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువు ముగిసింది.

మహేశ్వరంలో 820 మంది విద్యార్థులతో టాప్..

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 194 ప్రభుత్వ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. 194 స్కూళ్లలో మహేశ్వరం మోడల్ స్కూల్ ఒకటి. ఇక్కడ 6 నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు 500 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ మొదటి, రెండవ సంవత్సర గ్రూపుల్లో 320 మంది విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రంలో ఉన్న 194 మోడల్ స్కూళ్లలో మహేశ్వరం మోడల్ స్కూల్లో అత్యధికంగా 820 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి విద్య బోధిస్తుండడం రికార్డుగా పేర్కొంటున్నారు.

మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రత్యేకతలు...

- 4 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నత మౌలిక వసతులతో విశాలమైన తరగతి గదులు, ప్రహరీ గోడతో ఉన్న పక్కా స్కూల్ భవనం
- ఆహ్లాదకరమైన పచ్చిక బయళ్లతో కూడిన పాఠశాల ప్రాంగణం, పచ్చని చెట్లతో కూడిన పరిసరాలు
- ఇంగ్లీష్ మీడియంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యతతో కూడిన బోధన ఉంటుంది.
- విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అందిస్తారు.
- మెరిట్ ప్రాతిపధికన, దూర ప్రాంతం నుంచి వచ్చే బాలికలకు స్కూల్ ప్రాంగణంలోనే హాస్టల్ సౌకర్యం.
- సబ్జెక్టుల వారీగా విశాలమైన ల్యాబ్ సౌకర్యం
- అధునాతనమైన కంప్యూటర్లు, ప్రొజెక్టర్ల సహాయంతో హైస్పీడ్ ఇంటర్ నెట్ సౌకర్యంతో డిజిటల్ తరగతుల నిర్వహణ
- 32 అధునాతనమైన కంప్యూటర్లు, 20 మినీ ల్యాప్‌టాప్‌లు, 3 ప్రొజెక్టర్లతో మూడు ల్యాబ్‌లో డిజిటల్ తరగతుల బోధన
- 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు టూరిజం అండర్ హోటల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్ ట్రెండ్‌లలో వృత్తి విద్యా కోర్సులు చదువుకునే సౌకర్యం
- ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం
- విశాలమైన లైబ్రరీ సౌకర్యం
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం
- జాతీయ ఉపకారవేతనం (ఎన్ఎస్ఎంఎస్) స్కాలర్ షిప్ కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణ
- ఆసక్తికలిగిన విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారు.



మహేశ్వరం స్కూల్లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన..



మోడల్ స్కూల్లో ఉన్నత విద్యార్హతలు కలిగి, అనుభవంతో కూడిన ఉపాధ్యాయులచే విద్య బోధిస్తున్నారు. ఆహ్లాదకరమై వాతావరణంలో విశాలమైన తరగతి గదులలో డిజిటల్ తరగతుల బోధన సౌకర్యం ఉండడంతో ప్రతి సంవత్సరం అత్యున్నతమైన ఫలితాలు సాధిస్తుంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మోడల్ స్కూల్లో ప్రవేశం కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు.

–బి ధనుంజయ్, మోడల్ స్కూల్, కాలేజ్ ప్రిన్సిపల్, మహేశ్వరం

మాజీ మంత్రులను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



కేటీఆర్, సబితారెడ్డితో కామేశ్‌రెడ్డి తదితరులు

మీర్‌పేట: డిప్యూటీ మేయర్‌పై పెట్టిన అవిశ్వాసంలో విజయం సాధించిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డిని శనివారం మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్, డిప్యూటీ మేయర్‌లను గద్దె దించేందుకు అధికార కాంగ్రెస్, బీజేపీలు వేసిన ఎత్తుగడలను బీఆర్ఎస్ చిత్తు చేసిందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన పార్టీలకు ఈ విజయం చెంపపెట్టు అని కేటీఆర్‌కు వివరించినట్లు కామేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కేటీఆర్, సబితారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, నాయకులు సిద్దాల బీరప్ప, అంజయ్య, గడ్డమీది లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న గురు పూర్ణిమ ఉత్సవాలు



పులిమామిడి నిఖిల్ చేతనా కేంద్రంలో ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలో శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో గురు పూర్ణిమ ఉత్సవాలు శనివారం రెండో రోజు కొనసాగాయి. స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురూజీ భక్తులకు ప్రవచనాలు చేశారు. సాధనతో భగవంతుడి కృపతో పాటు మానసిక స్థైర్యం పెరిగి తమ సమస్యలను తామే పరిష్కరించుకునే శక్తిని పొందవచ్చన్నారు. ప్రతి నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయాన్ని గడపాలన్నారు. ఆదివారం గురు పూర్ణిమ ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి అనుమతించాలి

బడంగ్‌పేట్: గతంలో ఇళ్లులేని పేదలను గుర్తించి 60 గజాల చొప్పున స్థలానికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఇచ్చిన స్థలాల్లో ఆ పేదలు ఇళ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం, బాలాపూర్ తహసీల్దార్ అధికారులు అనుమతులు ఇవ్వాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం కోరారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పురుషోత్తం మాట్లాడుతూ.. కుర్మల్‌గూడలోని సర్వే నెంబర్ 46లో ఇళ్లు లేని పేదలను గుర్తించి 2006లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. అనివార్య కారణాలతో కట్టుకునే స్తోమత లేక ఇలాగే వదిలివేశారు. ఇప్పుడు నిర్మించుకుంటే బాలాపూర్ తహసీల్దార్ కూల్చివేస్తున్నారన్నారు. అదేవిధంగా జల్‌పల్లిలో 221 పేదలను గుర్తించి నాడు పట్టాలిచ్చి స్థలాలు చూపించారు. నేడు నవాబుల భూమి అంటున్నారని గుర్తు చేశారు. ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల సాయాన్ని కూడా అందించి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకురాళ్లు ఝాన్సీ, సుజాత తదితరులు ఉన్నారు.

నియామకం



మనోహర్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

మహేశ్వరం: బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కొండూరు మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మనోహర్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. దళితుల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పట్ల ఆకర్శితులను చేస్తానన్నారు. బీజేపీ దళితులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గౌరవిస్తుందన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు బొక్క నర్సింహారెడ్డి, మిద్దె సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతా సాంబమూర్తి, ప్రతాప్, రమేశ్ పాల్గొన్నారు.

ముసురుకుంది..!

- వర్షంతో మెట్ట పంటలకు ప్రాణం
- వరి నాట్లతో రైతన్నలు బిజీబిజీ



చౌదర్‌పల్లి గ్రామంలో పత్తి పంటకు ఎరువులు పెడుతున్న మహిళలు

యాచారం: కురుస్తున్న వర్షాలతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. వానాకాలం ప్రారంభంలో వర్షాలు కురియకపోవడంతో మెట్ట పంటల సాగు ఆలస్యమైంది. తడిపొడి భూమిలోనే రైతులు పత్తి విత్తనాలను విత్తారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలకు పైగా ఉండగా, ప్రస్తుతం 10వేల ఎకరాల వరకే సాగైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల్లోని రైతులు కొందరు పత్తి విత్తనాలను విత్తుతున్నారు. మరి కొందరు నెల కింద విత్తిన పత్తి పంటకు ఎరువులు వేస్తూ, కలుపు తీస్తున్నారు. రోహిణి కార్తెలో వరి నార్లు పోసిన రైతులు కరిగట్టు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, చింతుల్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో పత్తి, వివిధ రకాల కూరగాయల పంటల సాగు చేస్తున్నారు.

మంత్రి సభలో ప్రొటోకాల్ వివాదం

బడంగ్‌పేట్: మంత్రి సభలో ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులను ఒక్కొక్కరిగా వేదికపై ఆహ్వానించారు. మేయర్ పారిజాత ప్రొటోకాల్ పాటించడం లేదంటూ అధికారిక కార్యక్రమాలకు ఇతరులను స్టేజీపైకి ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. దీంతో మంత్రిని సన్మానించడానికి వస్తున్నారంటూ మేయర్ సర్దిచెప్పినా వినలేదు. గత ప్రభుత్వం తనను ఇబ్బంది పెట్టినప్పుడు ఏమైంది ప్రొటోకాల్ అని బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లను ప్రశ్నించింది. మంత్రి శ్రీధర్‌బాబు కలుగ చేసుకుని బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు అందరూ స్టేజీపైకి రావాలని ఇది మీ కార్పొరేషన్ అని ఆహ్వానించారు. దీంతో బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు స్టేజీ ఎక్కకుండానే వెనుదిరిగారు. అనంతరం సభ యధావిధిగా కొనసాగించారు.



ప్రొటోకాల్‌పై ప్రశ్నిస్తున్నర్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించండి

మాడ్గుల: విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మండల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివాల్కర్ యాదవ్‌ను శనివారం షాద్‌నగర్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో కలిసి వారిని శాలువా కప్పి సత్కరించారు. బట్టు కిషన్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి విజయ డెయిరీ నుంచి ప్రతీరోజు పాలు సరఫరా చేస్తున్నారన్నారు.

నేడు మహేశ్వరం, తుక్కుగూడలో వైన్స్‌లు, బార్లు బంద్

మహేశ్వరం: మహంకాళి బోనాల సందర్భంగా 21వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 22వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల వరకు మహేశ్వరం, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న వైన్స్‌లు, బార్ అండర్ రెస్టారెంట్లు మూసివేస్తామని మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోనాల ఉత్సవాల్లో గొడవలు తలెత్తకుండా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులు, ఎక్సైజ్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వనమహోత్సవంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సునందరెడ్డి

బడంగ్‌పేట్: తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఎంఎస్ తిరుమలగిరి డైరెక్టర్ డాక్టర్ వైఎస్ కార్తీక్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్, చీఫ్ హార్టికల్చర్ అధికారి డాక్టర్ ఎన్.సునందారెడ్డి హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటా రు.అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావర ణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. చెట్లే ప్రాణాధారమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


రైతు సంక్షేమమే లక్ష్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అన్నోజిగూడ నాయకులు

కందుకూరు: రైతుల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి అన్నారు. శనివారం వారు మండల పరిధిలోని అన్నోజిగూడలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఢిల్లీ కృష్ణ ఆధ్వర్యంలో రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. రైతును రాజును చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, ఎ.సత్యనారాయణ, ఎ.సుధాకర్, ఎ.రఘుమయ్య, ఎ.రాములు, డి.సాంబశివుడు, డి.రామకృష్ణ, డి.పరమేష్, డి.యాదయ్య, జి.యాదయ్య, డి.మల్లేష్, డి.రాములు, డి.ఆనంద్, డి.గిరి పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



బాలమ్మ(ఫైల్)

కందుకూరు: ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దెబ్బడగూడకు చెందిన కుమ్మరి బాలమ్మ(85) కుమారుడు నర్సింహతో కలిసి నివసిస్తోంది. గురువారం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లి వచ్చే వరకు తాళం వేసి ఉండడంతో తన అమ్మ కుమార్తె వద్దకు వెళ్లి ఉండవచ్చునని భావించారు. రెండు రోజుల తర్వాత నర్సింహ చెల్లికి ఫోన్ చేయడంతో అక్కడకు రాలేదని చెప్పింది. తెలిసిన ప్రదేశాల్లో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.